- www.aknu.edu.in
- nannayavani@aknu.edu.in
- nannayanewstv
- Adikavi Nannaya University
- 9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కె.పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 41 | 10-07-2023 | పుటలు : 4


## నన్నయ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన




**07.07.23 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కెమిస్ట్రీ, ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ కు విశేష స్పందన వచ్చింది. విశ్వవిద్యాలయ క్యాంపస్ తో పాటు ఆయా కళాశాలల నుండి 360 మంది విద్యార్థులు ప్లేస్మెంట్ డ్రైవ్ కు హాజరయ్యారు. శుక్రవారం యూనివర్సిటీ క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ ప్రోగ్రామ్ ను సెమినార్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ హెట్రో గ్రూప్స్ హైదరాబాద్, అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ లలో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎసెస్మెంట్ మరియు ప్రోడక్షన్ విభాగాలలో ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయన్నారు. బిఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ లేదా బిఫార్మసీ, ఆక్వాకల్చర్ పూర్తి చేసిన విద్యార్థులు క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ కు హాజరయ్యారన్నారు. హాజరైన విద్యార్థులంతా తమ విజ్ఞానాన్ని ప్రతిబింబించి ఇంటర్వ్యూలలో ఉత్తీర్ణులై ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఉద్యోగాలలో అర్హత సాధించని విద్యార్థులు నైపుణ్యాలను పెపొందించుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాలను పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం జగన్మోహనరెడ్డి చదువుకున్న విద్యార్థులందరికి విద్యతో పాటు ఉద్యోగం ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని దానికి తగినట్టు విద్యావ్యవస్థలోని అందరూ సహకరించాలన్నారు. విద్యార్థులకు విద్య, నైపుణ్యాలు, ఉద్యోగంతో పాటు విలువలను పాటిస్తూ ఉత్తమ పౌరులుగా సమాజంలో మెలగాలని సూచించారు. తమ విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారైన విద్య నైపుణ్యాలలో ప్రతిభావంతులని, కాబట్టి ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించాలని సంస్థల హెచ్.ఆర్ లకు వీసీ తెలియజేసారు. గోదావరి ప్రాంతంలో ఆక్వాకల్చర్ కు విస్తృత పరిధి ఉందని దానికి తగినట్టుగా ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యాకేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో నూతన కోర్సులు ప్రారంభించేందుకు ప్రతిపాదనను సూచించారు. తద్వార విద్యార్థులకు విద్యతో పాటు నైపుణ్యాలు ఉద్యోగావకాశాలు లభిస్తాయని, సంస్థలో ప్రతిభవంతులైన ఉద్యోగులు పని చేస్తారని చెప్పారు. తరువాత అతిథులను సన్మానించి జ్ఞాపికలతో అభినందించారు. అనంతరం విద్యార్థులతో వీసీ మమేకమై ఇంటర్వ్యూలలో చక్కని ప్రతిభ కనపరచి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ధైర్యంగా ఇంటర్వ్యూలలో సమాదాలను చెప్పాలని సూచనలను అందించి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ఆర్ అండ్ డి సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, అవంతి ఫుడ్స్ హెచ్.ఆర్ ఎస్.శశిభూషణ్, హెట్రో హెచ్.ఆర్ అబ్బాస్, శశి, రమేష్, ప్లేస్మెంట్ సెల్ ఫ్యాకల్టీ హనుమంతు, అప్పారావు, శ్రీకాంత్, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

## ఉపకులపతి ఉవాచ

### బాధ్యత



శిఖరాగ్రాలను చేరుకోవాలంటే అన్నిటిని ఎదుర్కొనే ధోరణి కూడా చాలా అవసరమౌతుంది. కర్తవ్య నిష్ఠ,సంకల్పం,నిజాయితీ, శ్రమ, సాధన అనేవి ఎదుర్కొనే ధోరణికి దోహదం చేస్తాయి.ఇది నిజం. యాపిల్ పండు క్రిందకే ఎందుకు పడుతుందని ఒక పెద్దాయన ప్రశ్నించాడు.అప్పటికున్న ప్రపంచం వేరు.ప్రశ్నించిన తర్వాత ప్రపంచం వేరు.ఆ ప్రశ్నలోంచే అన్వేషణలు, ఆవిష్కారాలు మొదలయ్యాయి. అర్జునుడు తనప్రశ్నలతో కృష్ణుడు కొన్ని సమాధానాలు చెప్పే దిశను కల్పించాడు.దానినే మనం భగవద్గీత అంటున్నాం. జ్ఞానులతో కలసి నడిచేవారు జ్ఞానాన్ని సంపాదించుకుంటారని అంటుంది బైబిల్. మనం పని చేస్తున్న సంస్థ గొప్పదయ్యే కొద్దీ మనం కూడా గొప్పవాళ్ళమౌతాం. ఒక్క అడుగుతోనే ప్రయాణం మొదలవుతుందనే సూక్తి అందరికీ తెలుసు. ఆలోచన కూడా అంతే. కేవలం ఒక్క ఆలోచనతోనే గొప్ప గొప్ప మార్పులు కలుగుతుంటాయి. మనం మన ఆలోచనలు ఏ మార్పునైనా తీసుకురాగలవు.మన శ్రమతో, సాధనలతో, విద్యార్థుల విజయాలతో,శ్రేయస్సును కోరేవారి సహకారంతో బోధన,బోధనేతర సిబ్బంది విశ్వవిద్యాలయాభివృద్ధిలో నిరంతర భాగస్వామ్యం కావాలని,
ఎవరి కర్తవ్యాలను వారు చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆకాంక్షిస్తున్నాను.

ఆచార్య కె.పద్మరాజు


## యువతకు అల్లూరి స్ఫూర్తి



చిన్న వయస్సులోనే స్వాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించి, మన్యంలో విప్లవ జ్వాలలను రగిల్చిన అల్లూరి సీతారామరాజు ను యువత ఆదర్శంగా తీసుకోవాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ పద్మరాజు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మన్యసీమలో తూర్పు కొండమీద కనిపించిన ఆకుపచ్చని సూర్యోదయం అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన దేశభక్తి, పోరాటం, పట్టుదల వంటి శుభలక్షణాలను యువత స్వీకరించాలని అన్నారు. విశ్వవిద్యాలయంలో చక్కని వాతావరణంలో చదువుకోవడానికి కారకులైన తల్లిదండ్రుల శ్రమను ఎప్పటికి మర్చిపోకూడదని, దానికి తగిన ప్రతిఫలాన్ని విద్య అనే ఆయుధంతో సమకుర్చుకోవాలన్నారు. యువత సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. సీతారామరాజు చిన్న వయస్సులోనే విప్లవవీరుడుగా చరిత్రను సృష్టించారని, అదే వయస్సు కలిగిన విద్యార్థులు సమాజానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నారని ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విద్యార్థులు అల్లూరిని స్ఫూర్తితో విద్యలో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, జన్మభూమికి జన్మనిచ్చిన వారికి సహకారులుగా ఉండాలని సూచించారు.అలాగే అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తూ విద్యార్థులు, అధ్యాపకులు తమ అభిప్రాయలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సీఈ ఎస్.లింగారెడ్డి, డా.ఎం.గోపాలకృష్ణ, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, పీడీ డా.ఎ.సత్యనారాయణ,డా. వరహాలదొర వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ



# సంపాదకీయం




## జ్ఞానపీఠ

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు. ఆయనొక విశ్వవిద్యాలయం.తెలుగు సాహితీ క్షేత్రంలో ఆయన పండించని పంట లేదు.చేయనివ్యవసాయం లేదు. ఆయన గాఢప్రతిభాశాలి.కొంతమంది ఆయన కవిత్వం ఒక పట్టాన అర్థంకాదంటూ పాషాణ పాకప్రభూ అన్నారు.మరి జ్ఞానపీఠ పురస్కారానికి ఆస్కారాన్ని కల్పించుకున్న శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో సీతా స్వయంవరఘట్టంలో "అతని దృష్టికి జానకిఆగలేదు, అతని కృష్టికి శివధనుస్సాగలేదు, సీత పూజడ వెన్నుగా శిరసువంచె, చెరుకుగడవోలె నడిమికి విరిగె ధనువు" ఎంత తేలికగా వర్ణించారు ఈ పద్యంలో. కాబట్టి సందర్భానికి తగినట్టుగా పూర్వకవుల్ని ఆవాహన చేసుకుని రచన సాగించే సందర్భశుద్ధి ఆయనకుంది. కల్పవృక్షంలో చాలాచోట్ల పూర్వకవుల బాణీలు మనకు కనిపిస్తాయి.

ఇంక ఆయన వేయపడగలు నవలలో వందేళ్ల తెలుగు జీవితాన్ని అద్భుతంగా చిత్రించారు. నైతిక విలువలు, సంప్రదాయ జీవన మార్గంపట్ల ఆయనకున్న గౌరవాలు అన్నీ ఆ నవలలో కనిపిస్తాయి. నాలుగు పాత్రలతో నిర్మించిన ఒక మహా మంటపం ఏకవీర నవల. సివిల్స్ పరీక్షల్లో తెలుగు లిటరేచర్ లో ఆ నవల అధ్యయనంగా ఉండేది. ప్రేమ,ప్రణయం విషయంలో నిగ్రహంతో ఉండటమే భారతీయ సంప్రదాయమని తీర్మానించారు. ఫ్రీ లవ్ సొసైటీ అనే వెర్రి తలల పర్యవసానాన్ని "చెలియలికట్ట"లో చర్చించారు. బరితెగించిపోతున్న నైతిక సూత్రాలకు అడ్డుకట్టే చెలియలికట్ట.విశ్వనాథ నవలలన్నింటినీ ఒక ప్రత్యేక ప్రయోజనంతోనూ,లక్ష్యంతోనూ రాశారు.

ఖండ కావ్యాలు,వచనం, లఘుకావ్యాలు, కిన్నెరసాని పాటలు ఇలా ఏ ప్రక్రియలోనైనా సనాతన భారతీయ తత్వాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి తన ప్రతిభను గ్రంథాలలోకి తీసుకొచ్చి వాటిని జాతికందించారు.విశ్వనాథ రచనల్లో జీవుని వేదన అనే ఒక మాట వినిపిస్తుంది. "ప్రతి మనిషికి కొన్ని తనవైన ఆలోచనలు, సొంత ఘోష ఒకటుంటుంది. అదే ఆయన ప్రతిపాదించిన జీవుని వేదన" అంటారు శ్రీరమణ.

గుమ్మడి పువ్వులో మెరిసే మంచు బిందువు బుట్టలో కూర్చోబెట్టిన పెళ్లికూతురులా ఉందని, గుండెల మీద బోర్లించిన పుస్తకంలా పిల్లవాడు పడుకున్నాడని వర్ణించిన ఉపమానాలు ఇంకెవరూ రాయలేరేమో!రాజమహేంద్రవరం దగ్గర కడియంలోని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారికి విశ్వనాథ శిష్యులైతే పివి.నరసింహారావు, బెజవాడ గోపాలరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, కళావెంకట్రావు, మండలి వెంకటకృష్ణారావు వంటి వారు విశ్వనాథ వారికి శిష్యులయ్యారు.

చిన్నమాట... ఏదైనా వారి ఒక రచన చదివిచూడండి.ఆయన విరాట్ స్వరూపం సాక్షాత్కరిస్తుంది.సమాజాన్ని తీర్చిదిద్దిన మహాకవులను, రచయితలను గుర్తుచేసుకోవడం కూడా గతవైభవ స్మరణమే.

# శాస్త్రాలన్నిటికీ గణితం మూలం



అన్ని శాస్త్రాలకు గణితశాస్త్రం మూలమని, విద్యార్థులు గణితశాస్త్రంపై పట్టుసాధించాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ తెలిపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథ్మెటిక్స్ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా ఆచార్య జి.పి.రాజశేఖర్ హాజరై "మ్యాథ్మెటికల్ మోడలింగ్ ఇన్ రియల్ లైఫ్ ప్రోబ్లమ్స్" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చక్కని ఉపన్యాసానందించారు. దీనిలో ముఖ్యంగా వైద్యశాస్త్రానికి మరియు గణితశాస్త్రానికి ఉన్న సంబంధాలను వివరించారు. వైద్యశాస్త్రంలోని వివిధ సమస్యలను గణితశాస్త్ర నిపుణతతో ఏ విధంగా పరిష్కరించవచ్చునని ఉదాహరణలతో తెలియజేసారు. కణితుల యొక్క ప్రాథమిక నిర్మాణాన్ని పరిచయం చేసి, తత్ఫలితంగా కణితి పెరుగుదల (టెంపోరల్–స్పేషియో–టెంపోరల్) యొక్క కొన్ని ప్రాథమిక మోడలింగ్ అంశాలను వివరించారు. ఇవి ఎక్కువగా సాధారణ అవకలన సమీకరణాల ఆధారిత విధానానికి పరిమితం చేయబడ్డాయని, దానిని పాక్షిక అవకలన సమీకరణాల ఆధారిత విధానాలతో తెలియజేసారు. మరొక అప్లికేషన్ మానవ మోకాలి కీలు లోపల హైడ్రోడైనమిక్ రవాణా చర్చించబడుతుందని, మృదులాస్థి నిర్మాణం కాంటాక్ట్ డైనమిక్స్‌ను ఎలా నియంత్రిస్తుంది అనేది వివరించారు. చివరగా రిజర్వాయర్ల లోపల చమురు వెలికితీతను ప్రభావితం చేసే కీలక కారకాలు పరిచయం చేసారు. మెరుగైన చమురు రికవరీపై కొన్ని అనుకరణలతో సంబంధిత నమూనాలు చర్చించారు. తరువాత రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, ఆచార్య ఆర్.డేవిడ్ కుమార్, గణితశాస్త్ర విభాగాధిపతి డా.కె.రేవతి మరియు విభాగాధ్యాపకులు రిసోర్స్ పర్సన్ ఆచార్య జి.పి.రాజశేఖర్ ను సన్మానించి జ్ఞాపకనందజేసి అభినందించారు.



# కాకినాడ క్యాంపస్ లో అల్లూరి జయంతి

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు మన్యం వీరుడు శ్రీఅల్లూరి సీతారామరాజు 126వ జయంతిని పురస్కరించుకొని క్యాంపస్ లోని ఎన్ఎస్ఎస్ మరియు ఎస్ఎఫ్ఐ విద్యార్థులు సంయుక్తంగా నిర్వహించిన సభలో శ్రీ అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ఇంచార్జి ప్రిన్సిపల్ డా. ఎం.పోచయ్య మాట్లాడుతూ స్వాతంత్ర సంగ్రామంలో గోదావరి మరియు మన్యం జిల్లాలలో గిరిజన ప్రాంత ప్రజలకు బ్రిటిష్ వారి నుండి విముక్తి కల్పించడానికి అల్లూరి సీతారామరాజు చేసిన గొరిల్లా పోరాటాలు భారత సంగ్రామ విప్లవాలలో చెప్పుకోదగినవని నిరక్షరాస్యులైన గిరిజన ప్రజలను ఒక దళంలా ఏర్పరిచి అత్యంత బలమైన బ్రిటీష్ సైన్యానికి ధీటుగా ఎదుర్కోవడానికి ఆయన చేసిన ప్రణాళికలు చెప్పుకోదగినవని అన్నారు.ఈ సందర్భంగా క్యాంపస్ లోని



ఎస్ఎఫ్ఐ విద్యార్థులు అలాగే ఎన్ఎస్ఎస్ విభాగం ఈ యొక్క జయంతిని నిర్వహించడం హర్షదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.నానిబాబు డా. శ్రీదేవి, అధ్యాపకులు డా.స్టీఫెన్, మనోజ్ ,శ్రీనివాస్ , విద్యార్థులు సూరిబాబు, రమేష్, సురేష్, రంజిత్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ఫిజిక్స్ పాఠ్య పుస్తకావిష్కరణ

**06.07.23 (మీడియాసెల్)**

బిఎస్సీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ విద్యార్థులకు సంబంధించిన "వేవ్ ఆప్టిక్స్" ఫిజిక్స్ పేపర్ 2 పాఠ్య పుస్తకాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. గురువారం వీసీ కార్యాలయంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేసారు. సి.బి.సి.ఎస్ నిబంధనలను అనుసరించి ఆంధ్రప్రదేశ్ లోని అన్ని విశ్వవిద్యాలయాలకు ఉపయోగపడే విధంగా కామన్ సిలబస్ తో పుస్తకాన్ని రూపొందించారని చెప్పారు. హిమాలయ పబ్లిషింగ్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ వారిచే "వేవ్ ఆప్టిక్స్" పేరుతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగాధిపతి డా.ఎస్.రాజ్యలక్ష్మి, దీప్తి డిగ్రీ కాలేజ్ మామిడికుదురు ఫిజిక్స్ విభాగాధిపతి డా.వి.ఎస్.పి.యర్రంశెట్టి




ఫిజిక్స్ పాఠ్యపుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ పద్మరాజు

లు రచించారని, వారిని అభినందించారు. పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేస్తూ నూతన విద్య బోధనలను విద్యార్థులకు అందించడంలో అధ్యాపకులంతా కృషి చేయాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, హిమాలయ పబ్లిషింగ్ రిజినల్ మేనేజర్ విజయపాండే, రాజ్ కుమార్ యాదవ్, విభాధ్యాపకులు బి.వి.వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువభారత్‌కు అమృతకాలం

## ఉత్సాహంగా యువ ఉత్సవ్






**08.07.23 (మీడియాసెల్)**

ప్రపంచ దేశాలలో యువత ఎక్కువ ఉన్న దేశం భారతదేశమని, భవిష్యత్ లో అన్ని దేశాలలో భారత యువత ఉద్యోగాలు చేస్తారని, ప్రస్తుత కాలం యువ భారత్ కు అమృతకాలమని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారములు మరియు క్రీడల మంత్రిత్వశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నెహ్రూ యువ కేంద్ర కాకినాడ మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వారి సౌజన్యంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రుడా చైర్ పర్సన్ ఎం.షర్మిలరెడ్డి జ్యోతిప్రజ్వలచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక అని,స్వామి వివేకానంద చెప్పిన సూక్తులను మననం చేసుకొని వివేకానందను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు . యువత చెడు మార్గాల వైపు ఆకర్షితులై వివిధ రకాలైన ఒత్తిడిలకు లోనై తొందరపడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వివేకానంద చెప్పినట్లుగా మీ శక్తి మీ బలం మీ బలహీనతే మీ మృత్యువు అని ప్రతి ఒక్కరూ జీవితాన్ని ఒక ఛాలెంజ్ గా తీసుకుని వారి ఆశయాలను సాధించడానికి అడుగులు వేయాలని కోరారు. జిల్లా యువజన అధికారి పి.అమృతేష్ మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ 2022 ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా చేసిన ప్రసంగంలో మాట్లాడుతూ 75 సంవత్సరాలు స్వాతంత్ర్యాన్ని పూర్తి చేసుకుని అమృత ఉత్సవాలు నిర్వహించామని అన్నారు. అలాగే 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఈ పాతిక సంవత్సరాల కాలం మనకు అమృత కాలమని ఈ అమృతకాలంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ముఖ్యంగా యువత దీనిలో పాలుపంచుకోవాలని అన్న విధంగా వారి ఆదేశాల మేరకు ఈ యువ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతలో నిద్రాణమై ఉన్న నైపుణ్యాలను వెలికి తీయటానికి వారిని దేశాభివృద్ధిపై దృష్టి పెట్టే విధంగా చేయటానికి ఐదు అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.అశోక్ మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర , యువ ఉత్సవం ఇక్కడ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని దీనిని యువత పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకొని వారి వారి నైపుణ్యాలను ప్రదర్శించాలని కోరారు .డా.పి.విజయనిర్మల మాట్లాడుతూ అన్ని పోటీలలో యువత చురుగ్గా పాల్గొనాలని, పూర్తిస్థాయి సామర్థ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీలలో యువత ఉత్సహంగా పాల్గొన్నారు. మొబైల్ ఫోటోగ్రఫీ పోయెట్రీ, డిక్లమేషన్, పెయింటింగ్ మరియు సాంస్కృతిగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో తూర్పుగోదావరి జిల్లాలోని ఆయా కళాశాలల నుండి యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభను కనపరించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై వివిధ పోటీలలో ప్రతిభ కనపరచిన యువతకు సర్టిఫికెట్స్, నగదు బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో యువత అధికంగా ఉన్నది భారతదేశమని, ఉక్కు నరాలు కలిగిన భారతదేశ యువత అభివృద్ధిలో ఆకాశమే హద్దుగా సాగాలన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకొని అన్ని అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యతో పాటు క్రీడాలు, సంస్కృతి, సాంప్రదాయలపై పట్టు కలిగి మన ఉనికిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలన్నారు. యువత మెరుగైన ఆలోచన విధానాలను అలవర్చుకోవాలన్నారు. విద్యావ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, యువతకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలిన పిలుపునిచ్చారు. యువతదే భవిష్యత్ అని, యువభారత నిర్మాతలు విలువలను పెంచుకొని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.















# జియోసైన్సెస్ ప్రోగ్రామ్స్ విజయవంతం






ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్టమెంట్ ఆఫ్ జియోసైన్సెస్ ఆధ్వర్యంలో డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు అండ్ శ్రీ ఎం.వి.జి.సుబ్రహ్మణ్యం మెమోరియల్ లెక్చర్ సిరీస్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ విజయవంతంగా ముగిసాయి. యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాలు సోమవారంతో ముగిసాయి. ముగింపు సమావేశానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై సర్టిఫికెట్స్, అవార్డులను అందజేసారు. అతిథి ఉపన్యాసాలనిచ్చిన ఓ.ఎన్.జి.సి చెన్నై పూర్వ చీఫ్ జియోలజిస్ట్ డా.ఎ.నల్లప్పరెడ్డి, మాజీ–డైరెక్టర్, జి.ఎస్.ఐ,సెక్రటరీ, ఓఎస్ జియో–ఇండియా ఉండవల్లి రవికుమార్ లను, కార్యక్రమాలను చక్కగా నిర్వహించిన జియోసైన్సెస్ విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావును మరియు విభాగాధ్యాపకులను అభినందించారు. జియోసైన్సెస్ లో మరిన్ని సమాజహితమైన కార్యక్రమాలు, పరిశోధనలు చేసేందుకు కృషి చేయాలని వీసీ సూచించారు. అనంతరం వీసీ పద్మరాజును సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య కె.రమణేశ్వరి,విభాగ అధ్యాపకులు డా.సుధారాణి,డా.అప్పారావు,డా.వేంకటతేజ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.






# ఎన్.ఐ.సి వాలంటీర్స్‌ను అభినందించిన వీసీ




విద్యార్థులకు సర్టిఫికెట్టులను అందజేస్తున్న వీసీ పద్మరాజు

**07.07.23 (మీడియాసెల్)**

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ (ఎన్.ఐ.సి) కు హాజరైన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ ని వీసీ ఆచార్య కె.పద్మరాజు అభినందించారు. శుక్రవారం యూనివర్సిటీలో వీసీ ఎన్.ఐ.సి లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి వివరాలను తెలియజేసారు. జూన్ 19 నుండి 25 వరకు చెన్నై క్రీసెంట్ ఇనిస్టిట్యూట్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగిన ఎన్.ఐ.సి 2023 లో పాల్గొన్నారని చెప్పారు. విద్యతో పాటు ఇలాంటి క్యాంప్ లలో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటుగా సమైక్య భావం పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో మంచిగా చదివి చదువుతున్న కళాశాలకు, యూనివర్సిటీకి మంచి పేరు తేవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. ఈ క్యాంప్ లో ఎన్.ఎస్.ఎస్ పిఓ ఎస్.యాకోబు, వివిధ కళాశాలల నుండి పది మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసారు.క్యాంప్ ను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ శుభాకాంక్షలను తెలిపారు.

# నన్నయలో ఐ.ఎఫ్.పి.శిక్షణ తరగతులు

తూర్పుగోదావరి జిల్లాలోని ఉండ్రాజవరం, చాగల్లు, కడియం మండలాల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐ.ఎఫ్.పి) శిక్షణ తరగతులు గురువారంతో ముగిసాయి. ఉపాధ్యాయులకు ఐ.ఎఫ్.పి, స్మార్ట్ టీవీ, స్మార్ట్ బ్లాక్ బోర్డ్స్, బైజూస్ వంటి కార్యక్రమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమంలో డిఈఓ ఎస్.అబ్రహాం మాట్లాడుతూ ఉపాధ్యాయులు నేర్చుకున్న సాంకేతికపరమైన శిక్షణను విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఉపయోగించాలన్నారు. వారం రోజుల శిక్షణ కార్యక్రమంలో 450 మందికి ట్రైనింగ్ ఇచ్చామన్నారు. రిసోర్స్ పర్సన్స్ గా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అధ్యాపకులు డా.ఎం.రామకృష్ణ, డా.డి.శ్రీనివాసరావు, డా.ఎ.విజయదుర్గ, డా.డి.కిషోర్ వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఎం.ఈ.ఓ వి.లజపతిరాయ్, ఐ.టి సెల్ కోఆర్డినేటర్ సత్తిబాబు, బైజూస్ జిల్లా కోఆర్డినేటర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.




: సమావేశంలో మాట్లాడుతున్న డిఈఓ అబ్రహాం.

# స్ఫూర్తి ప్రదాత వై.యస్.ఆర్

**08.07.23 (మీడియాసెల్)**

దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి అందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఆదికవి నన్నయ ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు అన్నారు. శనివారం నన్నయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ కె.పద్మరాజు వైయస్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తనదైన వినూత్న ఆలోచనలతో అభివృద్ధి పరచిన వైయస్ రాజశేఖర్ రెడ్డిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రజల మనస్సు దోచుకున్న మహోన్నత వ్యక్తి అని కొనియారు. ప్రజా సంక్షేమంలో వైయస్ రారాజుగా కీర్తింపబడ్డారని చెప్పారు. ఆరోగ్యశ్రీ, 108, విద్యార్థులు లకు ఫీజు రియంబర్స్మెంట్, 16 విశ్వ విద్యాలయలు స్థాపించడం, రైతుకు ఉచిత విద్యుత్, 25 పైసలకు వడ్డీ వంటివి మణిహారాలుగా నిలిచాయన్నారు. వైయస్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావు కృషి ఫలితంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్థాపించబడిందన్నారు. మహనీయుల ఆశయాలకనుగుణంగా అధ్యాపకులు విద్యార్థులు విద్యా ప్రమాణాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.






## యూనివర్సిటీ కార్యకలాపాలను పరిశీలించిన విసి

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని యూనియన్ బ్యాంక్, సి డి సి, అకాడమిక్ అఫైర్స్, అడ్మిషన్స్ విభాగాల కార్యకలాపాలను విసి ఆచార్య కె పద్మరాజు పరిశీలించారు. ఆయా విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విశ్వవిద్యాలయ సిబ్బందికి అనుబంధ కళాశాలలకు చక్కని సేవలను అందజేయాలని వీసీ సూచించారు.

# నిజమైన జీవితం



చెట్టు మీద పాకే గొంగళి పురుగు
చెబుతుంది నిజమైన జీవితం అంటే ఏమిటో.
మనముందే రంగురంగుల సీతాకోకచిలుకలా ఎగిరి వెళ్తుంది.
కానీ మనిషి మనసు మాత్రం గొంగళిపురుగులా అక్కడే ఉండిపోతుంది.
"ఎప్పటికైనా ఎదగాలి" అని అనుకోవడంలోనే మనిషి జీవితం గడిచిపోతుంది
జీవించడంలో ఎంతటి గొప్పతనం ఉందో ప్రకృతి పలువిధాలుగా మనకు బోధిస్తుంది
కానీ మనిషికి అర్థం కాదు. ఏదో విధంగా బ్రతకడం నిజమైన జీవితం అనిపించుకోదు
మనం ఎక్కడి నుండి వచ్చాం?ఎందుకు వచ్చాం?
ఏమి చేస్తున్నాం?
ఇంకా ఏమి చేయాలి ?
అనే ప్రశ్నలు తలెత్తాలి
వాటి గురించి వివరంగా తెలియజేసే జ్ఞానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి
నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి
ఇదే కదా నిజమైన జీవితం. మానవుని అంతిమ లక్ష్యం కూడా ఇదే కదా..!

- బి.సుశాంత్,అనూర్ అలుమ్ని